# న్యూజిలాండ్ ప్రజలపై నయానాజీల టెర్రరిస్టు దాడి

**న్యూజిలాండ్** దేశంలోని క్రీస్ట్‌చర్చ్ అనే నగరంలో 15 మార్చి 2019న రెండు మసీదులపై జరిగిన భయానక టెర్రరిస్టు దాడిలో 49 మంది చనిపోయారు. మరో 48 మంది గాయపడ్డారు. న్యూజిలాండ్ చరిత్రలో ప్రజలపై జరిగిన అతిపెద్ద కాల్పుల సంఘటన, అతితీవ్ర టెర్రరిస్టు చర్య యిదే! అంతేకాదు; ఇటీవల ప్రపంచంలోనే అత్యంత నీచమైన ఘటనల్లో ఒకటిగా యిది నిలుస్తుంది. లిన్‌వుడ్ మసీదులో ఏడుగురు, అల్‌నూర్ మసీదులో 41 మంది ప్రాణాలు పోగొట్టుకున్నారు. అల్‌నూర్ మసీదు నగరం నడిబొడ్డుకు సమీపంలో వుండే హాగ్లే పార్క్ పక్కనే వుంటుంది. మరొకరు ఆసుపత్రిలో మరణించారు. హతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం వుంది.

శ్వేత జాత్యహంకారి జరిపిన పై దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారందరికీ సిపిఐ (ఎం.ఎల్)కేంద్రకమిటీ నివాళులు ప్రకటిస్తోంది. గాయపడిన వారి కుటుంబాలకు సిపిఐ(ఎం.ఎల్) గాఢ సానుభూతిని చెబుతూ, వారు వేగంగా కోలుకోవాలని కోరుకుంటోంది. పై హత్యా కాండను సిపిఐ(ఎం.ఎల్) మానవత్వంపై సాగించిన నేరంగా భావిస్తూ ఖండిస్తోంది.

పై హత్యాకాండకు సంబంధించి ముగ్గురిని నిర్బంధించారు. 28 సంవత్సరాల ఆస్ట్రేలియా పౌరుడైన బ్రెంటన్ టెర్రంట్ పేరు మాత్రమే తెలిసింది. హత్యానేరం క్రింద అతనిని కోర్టులో ప్రవేశపెట్టారు.

ఇంకా చాలా వివరాలు తెలియకపోయి నప్పటికీ, యిదేది ఏమాత్రం అసాధరణమైనదో లేక, "మతిలేని" చర్యో కాదు. టెర్రంట్ విడుదల చేసి ఆన్‌లైన్‌లో ప్రచురించి 73 పేజీల 'ప్రణాళిక' ప్రకారం, అతను కొంతకాలం ఐరోపాలో వున్న తర్వాత రెండు సంవత్సరాలుగా దాడి పథకం వేస్తూ గడిపాడు.

"మహా పునర్ విస్థాపన" (వలస వచ్చిన వారిని తొలగించుట) అనే పేరుతోగల ప్రణాళిక ప్రకారం ఈ టెర్రంట్ తనకు తాను "ఫాసిస్టు"నని చెప్పుకున్న శ్వేత జాత్యహంకారి అని స్పష్ట మౌతుంది. నార్వే లేబర్ పార్టీ వారి విడిదిలో గల డజన్లకొద్దీ యివకుల్నీ, బాలబాలికల్నీ 2011లో సామూహికంగా హత్యగావించిన ముస్లిం ద్వేషంనిండివున్న యాండర్స్ బహ్‌రింగ్ బ్రీవిక్‌ను, పై పత్రం శ్లాఘించింది. బ్రీవిక్‌తో తనకుగల 'కొద్దిపాటి' పరిచయాన్ని గుర్తు చేసుకుంటూ తాను బ్రీవిక్ 'ఆశీర్వాదా'లు పొందినట్లు చెప్పుకున్నాడు. అమెరికా దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టెర్రంట్‌ను "తెల్లవారి గుర్తింపును పెంపొందించిన ఉమ్మడి ప్రయోజనశీలతకు ప్రతీక"గా కీర్తించాడు. వలసవచ్చిన వారిని 'దురాక్రమణదారులుగా' అభివర్ణించిన టెర్రంట్ "వలసలు రావటాన్ని అణచిపారెయ్యాలి, ఇప్పటికే మన నేలపై జీవిస్తున్న ఈ దురాక్రమణదారుల్ని తరిమివేయాలి" అని కూడా రాసుకున్నాడు.

నిజానికి ఈ దాడి ఒకానొక స్పష్టమైన దేశీయ, అంతర్జాతీయ ఆర్థిక రాజకీయ నేపథ్యంలో జరిగింది. అది కొలిక్కిరాని వాణిజ్య సంక్షోభంలో చిక్కుబడిన పెట్టుబడిదారీ విధానం లోని సామ్రాజ్యవాద హింసతోపాటు జాతి విద్వేష ఉన్మాదం, జాతీయోన్మాదం, విదేశీ విముఖత పెరిగిపోతున్న సందర్భంలో జరిగింది. గడిచిన రెండు దశాబ్దాలుగా ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాలు, పది లక్షలమందిపైగా ప్రజలను హతమార్చిన ఆఫ్ఘనిస్తాన్, ఇరాన్, సిరియా దేశాలపై అమెరికా నాయకత్వాన సాగుతున్న యుద్ధంలో కలిసి సాగుతున్న దాని కొనసాగింపుగా పరిగణించాలి. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ సైన్యాలు ఆఫ్ఘనిస్తాన్ పౌరులపై యధేచ్ఛగా సామూహిక హత్యాకాండ, అత్యాచారాలకు అలవాటుపడివున్నాయి.

దిగజారిపోతున్న సామాజిక పరిస్థితులు, అసమానత్వమూ-దారిద్ర్యమూ పెంపొందు తుండగా ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాలలోని ప్రజలను, మరీ ముఖ్యంగా యువకులను పక్కదారి పట్టించటానికి, తీవ్ర మితవాద ఉద్వేగాలు, జాతిద్వేషతత్త్వమూ పేరుకుపోయేట్లు ప్రయత్నపూర్వకంగా చేస్తున్నారు. న్యూజీలాండ్‌లో యిపుడు జరిగిన దురాగతము ఇటీవల కాలంలో సంభవించిన మితవాద టెర్రరిజం సాగించిన అనేక చర్యల పర్యవసానం మాత్రమే. మచ్చుకు కొన్ని-నార్వే దేశంలో బ్రీవిక్ సాగించిన సామూహిక హత్యాకాండ; 2012లో అమెరికాలోని విస్కాన్సన్ నగరంలో సిక్కుల ఓక్‌క్రీక్ గురుద్వారాలో; 2014లో కాన్సాస్‌లోని ఓవర్‌లాండ్ పార్క్‌లోగల యూదుల నివాసగృహంలో; దక్షిణ కరోలినా రాష్ట్రంలో చార్లెస్టయిన్‌నందు 2015లో ఆఫ్రో అమెరికన్‌ల ప్రార్థనా మందిరంలో జరిగిన హత్యాకాండలు; 2016లో బ్రిటీషు లేబర్‌పార్టీ నాయకుడు జోకాక్స్ హత్య; కెనడా దేశంలోని క్యూబెక్ నగరంలో 2017లో ఒక మసీదులో 9 మందిని చంపివేయటం; అమెరికాలోని పెన్సిల్వేనియా రాష్ట్రంలోగల పిట్స్‌బర్గ్ నగరపు ట్రీ ఆఫ్ లైఫ్ అనే ప్రార్థనా మందిరంలోగల 11 మంది యూదు భక్తులను 2018లో హత్య గావించటాన్ని పేర్కొనవచ్చు. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల్లోని రాజకీయ నాయకులు ఇస్లామిక్ వ్యతిరేక భావోద్వేగాలను బాహాటంగా రెచ్చగొడుతున్నారు. న్యూజీలాండ్ మసీదుల్లో హత్యాకాండకు బలైన వారే హత్యాకాండకు బాధ్యులు అంటూ ఆస్ట్రేలియా దేశానికి చెందిన ఫ్రజర్ యానింగ్ అనే తీవ్ర మితవాద స్వతంత్ర సెనేటర్ ఫాసిస్టు స్వభావంగల పత్రికా ప్రకటన యిచ్చాడు. వలసవస్తూ వుండటమే అసలు సమస్య అని అతను అభివర్ణించాడు.

క్రీస్ట్‌చర్చ్‌లోని మసీదులో జరిగిన దాడులు ఏమి సూచిస్తున్నాయంటే-1930 తర్వాత ప్రపంచ పెట్టుబడిదారీ దేశాలు కూరుకుపోయి వున్న తీవ్ర సంక్షోభంవల్ల పెట్టుబడి సాగించే పీడనా, అణచివేతలను సమర్థించుకోవటానికి అంతర్గత జాతీయోన్మాదతత్త్వాన్నీ, సైనిక తత్త్వాన్నీ, ముస్లింద్వేష ఉన్మాదాన్నీ జారీచేస్తూండటాలూ పెంచుకుంటూ పోతున్నారు. సోషలిస్టు దృక్పథంతో కూడిన శ్రామిక వర్గపోరాటాల ద్వారా మాత్రమే వీటిని తిప్పికొట్టగలుగుతాము.

ooo